సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 27 । మార్చి । 2025



పేకమేడలా కుప్పకూలిన జీ ప్లస్ 5 భవనం

భద్రాచలంలో స్లాబ్ వేసి ఉన్న ఐదంతస్తుల భవనం బుధవారం మధ్యాహ్నం పేకమేడలా కుప్పకూలింది. ఈ ఘటనలో శిథిలాల కింద ఇద్దరు కూలీలు చిక్కుకున్నట్లు యంత్రాంగం గుర్తించింది. వీరి ఆచూకీ కోసం జిల్లా, రాష్ట్ర, కేంద్ర సహాయక బృందాలు అలుపెరగక శ్రమిస్తున్నాయి. భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు పర్యవేక్షణలో అర్ధరాత్రి వరకు సహాయక చర్యలు కొనసాగుతుండగా ఇంకా ఫలితం కానరాలేదు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఇద్దరి కోసం అందరూ..

టిక్.. టిక్.. టిక్..

- మధ్యాహ్నం 2–45 గంటలకు భవనం ఒక్కసారిగా కుప్పకూలింది.
- పది నిమిషాల పాటు పరిసర ప్రాంతాలను దుమ్ము మేఘాలు కమ్మేశాయి.
- 3గంటలకు స్థానికులు.. ఆ వెంటనే అగ్నిమాపక సిబ్బంది చేరుకున్నారు.
- 3–15 గంటలకు భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ అక్కడికి వచ్చారు.
- సాయంత్రం 4గంటలకు శిథిలాలను తొలగింపు కోసం పొక్లెయినర్లను రప్పించారు.
- 4–12గంటలకు ఎస్పీ రోహిత్‌రాజ్, 4–40కి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చేరుకున్నారు. శిథిలాలపైకి వెళ్లిన కలెక్టర్, ఎస్పీ అక్కడి పరిస్థితిని అంచనా వేశారు.
- 5–45 గంటలకు శిథిలాల కింద ఉన్న కనకదుర్గ ఆలయం గర్భగుడి వెనుక భాగానికి కన్నం వేయడం ద్వారా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు.
- 6–15 గంటలకు క్రేన్ల సాయంతో శిథిలాలకు డ్రిల్ వేస్తూ కిందికి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు
- 6–57 గంటలకు శిథిలాల కింద బాధితుడి గుర్తింపు.
- రాత్రి 8గంటలకు చేయి ఊపిన బాధితుడు కామేశ్వరరావు.
- 8.50గంటల నుంచి భవనం కింద నుంచి లోనకు వెళ్లేందుకు తవ్వకం మొదలు
- 10గంటలకు విజయవాడ నుంచి చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు – భద్రాచలం అర్బన్

భద్రాచలంలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం

- శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు కూలీలు
- సహాయక చర్యల్లో కామేశ్వరరావు ఆచూకీ లభ్యం
- అర్ధరాత్రి వరకు ముమ్మరంగా సాగుతున్న రెస్క్యూ ఆపరేషన్
- రంగంలోకి ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- సహాయక చర్యల పర్యవేక్షణలో కలెక్టర్, ఎస్పీ

నాణ్యత లేదు.. అడ్డగోలు నిర్మాణం

నలభై ఏళ్ల క్రితం నిర్మించిన పాత భవనాన్ని కేవలం 9 ఇంటూ 9 అంగుళాల పిల్లర్లపై కట్టారు. ఇది జీ ప్లస్ వన్ నిర్మాణానికే ఎక్కువ. ఇలాంటి పాత భవాన్ని కొనుగోలు చేసి, ఆపై ఏకంగా మరో ఐదు అంతస్తులు నిర్మించారు. వాస్తవానికి జీ ప్లస్ 2 కంటే పెద్దవైన బహుళ అంతస్తుల భవనం నిర్మించాలంటే 12 ఇంటూ 18 అంగుళాల పిల్లర్లు, బీమ్‌లు ఉండాలి. వీటిలో ప్రతీ పిల్లర్‌లో నాలుగు చొప్పున 20 ఎం.ఎం., 16 ఎం.ఎం. రాడ్లు వేయాలి. కానీ కూలిపోయిన భవనంలో కేవలం 12 ఎం.ఎం. రాడ్లనే ఉపయోగించారు. దీనికి తోడు ఐదు అంతస్తుల స్లాబ్‌కు వేశాక గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న గోడలు కూల్చేశారు. డిసెంబర్‌లో వచ్చిన భూకంపం కూడా ఈ నిర్మాణంపై ప్రభావం చూపింది. వెరసి ఇటీవల పనులు మొదలుపెట్టే సమయానికి పలు పిల్లర్లు, బీమ్స్‌కు పగుళ్లు కనిపించాయి.

చిప్పింగ్ చేయాలంటూ

పిల్లర్లు, బీమ్స్‌కు పగుళ్లు వచ్చిన చోట పటిష్టం చేసేందుకు చిప్పింగ్ ప్రక్రియ చేపడుతారు. చిప్పింగ్‌లో భాగంగా బలహీనపడిన పిల్లర్, బీమ్ వద్ద సుత్తితో కొడుతూ కొంత కాంక్రీట్ తీసేస్తారు. ఆ తర్వాత రసాయనాలు కలిపిన లేపనాన్ని కలిపి సిమెంట్ కాంక్రీట్ మిశ్రమంతో వేస్తారు. పూర్తిగా బలహీనపడిన భవనంలో చిప్పింగ్ పనులు చేస్తున్న సమయాన గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎడమ వైపు నుంచి రెండో పిల్లర్ ముందుగా కుంగుబాటుకు లోనైంది. క్షణాల్లోనే మిగిలిన పిల్లర్లు కుంగిపోవడంతో ఉన్న చోటే భవనం కుప్పకూలింది.

బాధితుడి చెంతకు..

గనుల్లో మాదిరి తవ్వకం మొదలుపెట్టిన సహాయక బృందాలు అర్ధరాత్రి 12గంటలు దాటాక బాధితుడు కామేశ్వరావు ఉన్నచోటకు చేరారు. ఆయన కాలు కనిపించగా బృందంలోని వైద్యుడు తాకినట్లు చెబుతున్నారు. అయితే, శరీరం వాపు వచ్చిందని గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో ఆయనను బయటకు తీసుకురాగానే అత్యవసరంగా ఐసీయూకు తరలించేలా అంబులెన్స్‌ను సిద్ధం చేశారు.

విఫలమైన తొలి ప్రయత్నం (సాయంత్రం 5-45 నుంచి 6-10 గంటల వరకు)

జీ ప్లస్ 5గా నిర్మిస్తున్న భవనం మధ్యాహ్నం 2–45 గంటలకు ఒక్కసారిగా కుప్ప కూలింది. సరిగ్గా ఒక ఫ్లోర్‌పై మరో ఫ్లోర్ స్లాబ్ పడడంతో ఐదో ఫ్లోర్ తప్ప మిగిలిన అన్ని ఫ్లోర్ల స్లాబ్‌లు ఒక దానితో ఒకటి అతుక్కుపోయాయి. ఆ సమయాన గ్రౌండ్ ఫ్లోర్‌లో కూలీలు కామేశ్వరరావు, ఉపేందర్ పని చేస్తున్నారు. అయితే, పనుల్లో ఆరుగురు ఉన్నారని, నలుగురు భోజనానికి వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగిందని తొలుత ప్రచారం జరిగినా ఎలాంటి స్పష్టత రాలేదు. ఇక సహాయక చర్యల్లో భాగంగా తెప్పించిన జేసీబీలు, క్రేన్ల సాయంతో ఐదు నుంచి ఆరు వేల టన్నుల బరువైన శిథిలాలను ఎలా తొలగించాలి, శిథిలాల కింద చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలనే సంశయం ఏర్పడింది. స్వయంగా ప్రమాదస్థలిని పరిశీలించిన కలెక్టర్ పాటిల్ ఓ నిర్ణయానికి వచ్చారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కనకదుర్గ ఆలయం గర్భగుడి వెనుక భాగాన రంధ్రం చేయడం ద్వారా సహాయక బృందాలను శిథిలాల కిందికి పంపాలని నిర్ణయించారు. దీంతో ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ, అగ్నిమాపక శాఖ ఉద్యోగులు రంధ్రం చేసే పని మొదలుపెట్టారు. ఆలస్యమయ్యే కొద్దీ బాధితుల ప్రాణాలకు ప్రమాదమే కావడంతో మరోసారి కలెక్టర్ రంగంలోకి దిగారు. గర్భగుడి కుడి వైపు గోడకు రంధ్రం చేసి లోపలికి చూడగా ఆ గదికి బయట నుంచి గడియ పెట్టిన విషయం తెలిసింది. దీంతో ఆ ప్రయత్నాలు అక్కడే ఆపేశారు.



శిథిలాల వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

బాధితుడి గుర్తింపు (సాయంత్రం 6-15నుంచి రాత్రి 6-57గంటల వరకు)



కట్టర్ల సాయంతో బీమ్‌లు తొలగిస్తూ ముందుకు సాగుతున్న రెస్క్యూ టీమ్ సభ్యులు

తొలి ప్రయత్నం విఫలం కావడంతో నేరుగా గ్రౌండ్ ఫ్లోర్‌కి వెళ్లేలా క్రేన్ల సాయంతో శిథిలాలను తొలగిండం మొదలెట్టారు. అడ్డుగా వచ్చిన బీమ్‌లను కట్టర్ల సాయంతో కత్తిరించారు. దీంతో ఫస్ట్ ఫ్లోర్ లోపలి భాగం కొంత మేర కనిపించింది. ఆ ప్రాంతంలో ఒక చిన్న వెలుతురు కనిపించడంతో తీక్షణంగా పరీక్షించగా అది మొబైల్ ఫోన్‌గా తేలింది. ఆ మొబైల్ ఫోన్ లంచ్ బాక్స్ సంచిలో ఉన్నట్టు గుర్తించారు. లోపల ఎవరైనా ఉన్నారా అని రెస్క్యూ టీమ్ సభ్యులు పదే పదే అడగగా శిథిలాల కింద చిక్కుకున్న కామేశ్వరరావు నుంచి బదులు వచ్చింది.

వందల మంది

సింగరేణి రెస్క్యూ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ ఉద్యోగులకు తోడుగా విజయవాడ నుంచి 30మంది సభ్యులతో కూడిన రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రాత్రి 10గంటల సమయాన భద్రాచలం చేరుకున్నాయి. ఎన్డీఆర్ఎఫ్ డిప్యూటీ కమిషనర్ సుకుందర్, సీఐ పింటూ నంది ఈ బృందాలకు నేతృత్వం వహిస్తున్నారు. తలకు హెల్మెట్లతో టీమ్ సభ్యులు డ్రిల్లింగ్ మిషన్లు, కట్టర్లు, స్ప్రెడర్లు, హైడ్రాలిక్ లిఫ్టలు ఉపయోగిస్తూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, ఏఎస్పీ విక్రాంత్‌సింగ్, ఆర్డీఓ దామోదర్ రావు, గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు అర్ధరాత్రి వరకు అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

ఆది నుంచీ అనుమానాస్పదమే



ఆదివాసీ సంఘాల నాయకులతో శ్రీపతి వాగ్వాదం (ఫైల్)

భద్రాచలం: భద్రాచలానికి శ్రీనివాసం శ్రీరామ స్వాతి – శ్రీపతి దంపతులు పదేళ్ల క్రితం వచ్చారు. అప్పటి నుంచి పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీపతి తెలుపు, కాషాయ వస్త్రాలు ధరించి, గుబురు గడ్డంతో స్వామిజీలా కనిపించేవారు. ఆ తర్వాత పాత భవనాన్ని కొనుగోలు చేసి అక్కడే ఆలయ నిర్మాణం ప్రారంభించారు. అది పూర్తికాక ముందే జీ ప్లస్ 5 భవన నిర్మాణం మొదలుపెట్టారు. ఆధ్యాత్మిక ముసుగులో అక్రమ కట్టడాలేమిటని ప్రశ్నించిన స్థానికులతో పలుమార్లు తగదా పడ్డారు. భవన నిర్మాణ పనులపై అభ్యంతరం వ్యక్తం చేసిన గిరిజన సంఘాల నేతలతోనూ గొడవ పెట్టుకున్నారు. భవనం కూలిపోయిన తర్వాత ఈ దంపతుల విషయమై స్థానికులను వాకబు చేయగా ఎవరూ పూర్తి వివరాలు చెప్పలేకపోయారు. అయితే, శ్రీపతిని బుధవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తున్నా స్పష్టత రాలేదు.

పలకరింపు (రాత్రి 7-17 నుంచి 8-35గంటల వరకు)



విక్టిమ్ లొకేషన్ కెమెరాతో పరిశీలిస్తున్న సిబ్బంది

శిథిలాల కింద బాధితుడు ఎలా ఉన్నాడో తెలుసుకునేందుకు విక్టిమ్ లోకేషన్ కెమెరాను బాధితుడు ఉన్న ప్రదేశానికి పంపారు. వెలుతురుతో పాటు కెమెరాను చూసిన బాధితుడు తన కుడి చేయిని ఊపుతూ బదులిచ్చాడు. ఎడమ చేయి, కాలు భాగం శిథిలాల కింద చిక్కుకున్నట్టుగా రెస్క్యూ టీమ్ సభ్యులు గుర్తించారు. తల, ఇతర ప్రధాన అవయవాలకు ప్రాణాపాయం కలిగించే గాయాలేమీ కాలేదని నిర్ధారించుకున్నారు. ఆ తర్వాత బాధితుడికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఆక్సిజన్ సిలిండర్ ద్వారా ప్రాణవాయువు అందించడం మొదలుపెట్టారు.

శిథిలాల కింద మైనింగ్ (రాత్రి 8-50 గంటల నుంచి)



బొరియల్లా తవ్వుతున్న రెస్క్యూ టీమ్..

ఆరు వేల టన్నుల బరువైన కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు చాలా సమయం పడుతుందని నిపుణులు తెలిపారు. దీంతో శిథిలాల తొలగింపు నిర్ణయాన్ని పక్కన పెట్టి, భవనం కింద నుంచి తవ్వుతూ లోపలికి వెళ్లి గ్రౌండ్ ఫ్లోర్ వరకు చేరాలని నిర్ణయించారు. బొగ్గు గనుల్లో నేలను తవ్వుతూ భూగర్భంలోకి వెళ్లినట్టుగా ఆరువేల టన్నుల బరువైన శిథిలాల కింద నేలను తవ్వడం మొదలెట్టారు. ఇలా తవ్వుకుంటూ(ఎలుక బొరియ చేసినట్టుగా) బాధితుడు కామేశ్వరరావు ఉన్న ప్రదేశం కిందకు చేరుకోవాలని, ఆ తర్వాత బాధితుడికి ఇబ్బంది లేకుండా పైన ఉన్న బరువులు పడకుండా రక్షించాలని నిర్ణయించారు. మరోవైపు శిథిలాల కింద చిక్కుకున్న ఇంకో బాధితుడు ఉపేందర్ ఉనికిని గుర్తించే ప్రయత్నం కూడా చేస్తున్నారు.



ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి భవన ప్లాన్‌ను వివరిస్తున్న కలెక్టర్

యాక్షన్ మోడ్‌లో కలెక్టర్..

భద్రాచలం: భవనం కుప్పకూలిన సమాచారం తెలుసుకున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ హుటాహుటిన 4–40 గంటలకు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటివరకు నెమ్మదిగా సాగిన సహాయక చర్యల్లో వేగం పెంచేలా అందరినీ అప్రమత్తం చేశారు. భవనం నలువైపులా పరిశీలించి ఎటు నుంచి లోనికి వెళ్లే అవకాశం ఉందని చూశారు. లైట్లు వేసి శిథిలాల కింద ఎవరైనా ఉన్నారా అంటూ కేకలు వేశారు. శిథిలాలపైకి చేరుకుని తాడు సాయంతో లోనికి వెళ్లొచ్చా అంటూ సింగరేణి, ఫైర్ అధికా రులతో చర్చించారు. ఆ అవకాశం లేకపోవడంతో అమ్మవారి ఆలయానికి వెనుక భాగాన రంధ్రం చేసి గ్రౌండ్ ఫ్లోర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించారు. అక్కడా అవకాశం లేకపోగా జేసీబీలు, క్రేన్ల సాయంతో ఒక్కో ఫ్లోర్ శిథిలాలను తొలగిస్తూ లోపలకి వెళ్లాలని సిబ్బందిని ఆదేశించారు. అంతేకాక బాధితులకు ఆక్సిజన్ పంపేలా ఏర్పాట్లు చేయించారు. ఆతర్వాత విజయవాడ నుంచి చేరిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు భవన ప్లాన్‌ను వివరించి, అప్పటివరకు చేపట్టిన సహాయక చర్యలు, లోనకు వెళ్లే ఉన్న మార్గాలను తెలిపారు.

అంతా క్షణాల్లోనే...

కుప్పకూలిన భవనం చుట్టుపక్కల నివాసాల్లోని వారిని పలకరించగా.. స్లాబ్‌లు కూలుతున్న సమయాన ఓ మాదిరి శబ్దం వచ్చిందని తెలిపారు. అదేమిటో చూడడానికి బయటకు రాగా ఒక్కసారిగా దుమ్ము కమ్మేసిందని వెల్లడించారు. దుమ్ము నుంచి తేరుకున్నాక పరిశీలిస్తే కళ్ల ముందు నిలువెత్తు కనిపించే భవనం కుప్పకూలి ఉందని తెలిపారు. అదే స్లాబ్‌లు తమ ఇళ్లపై కూలితే ఏం జరిగేదోనన్న ఆందోళన ఎదురైందని పలువురు చెప్పారు.

విపత్తులు కొత్త కాకున్నా...


ప్రతీ ఏడాది గోదావరి వరదలు వచ్చే భద్రాచలం ఏజెన్సీకి రెస్క్యూ ఆపరేషన్లు కొత్త కాదు. కానీ భవనం కూలిపోయినప్పుడు శిథిలాల కింద చిక్కుకున్న బాధితులను కాపాడడం మాత్రం ఇదే తొలిసారి. దీంతో స్థానికులు వందల సంఖ్యలో ఘటనా స్థలికి చేరుకుని సహాయక కార్యక్రమాలను చూస్తున్నారు.

గాలి వస్తోంది

కామేశ్వరరావు

రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా ఆక్సిజన్‌ను లోపలికి పంపిన తర్వాత అక్కడున్న వారు గాలి బాగా వస్తుందా కామేశ్వరరావును అడిగితే.. 'బాగానే వస్తుంది, ఓకే' అంటూ సమాధానం ఇచ్చాడు. శిథిలాల కింద చిక్కుకున్నది రమేశ్ అని తొలుత భావించినా ఆ తర్వాత కామేశ్వరరావుగా గుర్తించారు.

అర్ధరాత్రి 1.42గంటలకు



శిథిలాల కింద చిక్కుకుపోయిన కామేశ్వరరావు వద్దకు రెస్క్యూ సిబ్బంది అర్ధరాత్రి 1.30గంటలకు చేరుకున్నారు. ఆ వెంటనే ఆయనకు ఆక్సిజన్ అమర్చి బయటకు తీసుకొచ్చేసరికి 1.42 అయింది. అప్పటికే అంబులెన్స్‌తో సిద్ధంగా ఉన్న వైద్యులు, సిబ్బంది ఆయనను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. – భద్రాచలం అర్బన్

రామయ్య కల్యాణానికి.. కావాలి రాష్ట్ర హోదా

- ఈ ఏడాదే ప్రకటించాలని కోరుతున్న భక్తులు
- భద్రాచలంలో సీతారాముల పెళ్లికి వందల ఏళ్ల చరిత్ర
- ప్రతీ సంవత్సరం కనులపండువగా కల్యాణ వేడుక
- నవమి రోజున ఉభయ రాష్ట్రాల్లోనూ ఆధ్యాత్మిక శోభ



భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలంలో వందల ఏళ్లగా జరుగుతున్న సీతారాముల కల్యాణం రాష్ట్ర వ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఘన చరిత్ర కలిగిన ఈ వేడుకకు సముచిత గుర్తింపు, నిధులు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి గత పదేళ్లుగా ఆశించిన సహకారం కరువైంది. అయితే ఇప్పుడీ పరిస్థితిలో మార్పు వచ్చింది. ఆలయం, భద్రాచలం పట్టణ అభివృద్ధిపై దృష్టి పెరిగింది. తొలి విడతలో రూ.60 కోట్లు కేటాయించగా ఇందులో రూ.34 కోట్లు విడుదల కూడా అయ్యాయి. ఆలయ అభివృద్ధి నమూనాకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన ఊహా చిత్రాలకు రాష్ట్ర వ్యాప్తంగా మంచి స్పందన వచ్చింది. ఇదే ఒరవడిలో ఈ ఏడాది నుంచి శ్రీరామ నవమి వేడుకలకు రాష్ట్ర పండుగ హోదా కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

సీఎం చేతుల మీదుగా..

మధ్యయుగాల కాలంలో పాల్వంచ తహసీల్దార్‌గా పని చేసిన కంచర్ల గోపన్న భద్రాచలంలో సీతారాములకు ఆలయాన్ని నిర్మించారు. ఆ తర్వాత కాలంలో ఇక్కడ చైత్ర శుద్ధ నవమి రోజున స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపించే పద్ధతిని ఆయన ప్రవేశపెట్టారు. అనంతరం అప్పటి గోల్కొండ నవాబు తానీషా సైతం ఈ వేడుకలో భాగమయ్యారు. సీతారాముల పెళ్లికి స్వయంగా హాజరై పట్టువస్త్రాలు సమర్పించడమే కాకుండా ముత్యాల తలంబ్రాలు, గులాల్‌తో పాటు ఆర్థికంగా తోడ్పాటు అందించారు. స్వాతంత్రం వచ్చే నాటికి నవమి వేడుకలకు అప్పటి ప్రభుత్వం తరపున రూ.1,300 ఇచ్చేదని రికార్డులు చెబుతున్నాయి. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్, ఇప్పటి తెలంగాణ వరకు నవమి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రులు పట్టు వస్త్రాలు సమర్పించే ఆనవాయితీ కొనసాగుతూ వస్తోంది. కొన్నేళ్లుగా ఈ సంప్రదాయానికి బ్రేక్ పడినా.. ఈసారి ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తారని ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

ఊరూ వాడా జరిగే వేడుక..

భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణ వేడుకల విశేషాలను అప్పట్లో భక్తులు రేడియోల్లో వినేవారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి ప్రత్యేక బృందం భద్రాచలం వచ్చేది. ఆ తర్వాత దూరదర్శన్‌లో ప్రత్యక్ష ప్రసారాలు వచ్చేవి. మారిన పరిస్థితుల్లో టీవీలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, మొబైల్ ఫోన్లలో ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు లైవ్ స్ట్రీమింగ్‌లో ఈ వేడుకలను చూస్తున్నారు. ఇక్కడ జరిగే పెళ్లి వేడుకలకు సమాంతరంగా తెలుగు నేలపై పల్లె, పట్నం తేడా లేకుండా వేలాది ఆలయాల్లో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో ఆదర్శ దంపతుల వివాహ వేడుకలు ఘనంగా జరుగుతుంటాయి. అయితే భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర పండుగ హోదా దక్కితే ఇటు దేవాదాయ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి నిధులు మంజూరవుతాయి. ఫలితంగా ఆలయంతో పాటు పట్టణంలో మౌలిక సదుపాయాలూ మెరుగవుతాయి.



రాష్ట్ర పండుగ హోదా వస్తే..

భారీ స్థాయిలో భక్తులు వచ్చే పుణ్యక్షేత్రాల్లో మెరుగైన సౌకర్యాలు, రవాణా సదుపాయాలతో పాటు విస్తృత ప్రచారం చేస్తే పెట్టిన పెట్టుబడికి రెట్టింపునకు మించి లాభాలు వస్తాయనడానికి తాజా ఉదాహరణ ఇటీవల ప్రయాగ్ రాజ్‌లో జరిగిన కుంభమేళా. రూ.3వేల కోట్లు ఖర్చు చేస్తే రూ.3లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని స్వయంగా ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. రాష్ట్రంలో మేడారం జాతర మరో ఉదాహరణగా నిలుస్తోంది. ఒకప్పుడు గిరిజన పూజారులే చందాలు వసూలు చేసి జాతర నిర్వహించేవారు. ప్రభుత్వ సహకారం నామమాత్రంగా ఉండేది. అయితే 1996లో మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను రాష్ట్ర పండుగగా నాటి ప్రభుత్వం గుర్తించగా.. వేడుకల నిర్వహణకు రూ.2 కోట్లు కేటాయించారు. ఆ వెంటనే 1998లో జంపన్న వాగుపై వంతెన నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి మేడారం జాతరకు భక్తుల రాక, నిధుల ప్రవాహం పెరిగాయి. ఒకప్పుడు అడవిలా ఉన్న మేడారం ఇప్పుడు చిన్న పట్టణంగా మారింది. సెలవు రోజుల్లో భక్తులు తండోపతండాలుగా మేడారం వస్తుంటారు. స్థానికులకూ ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి.

అధ్యాపకుడికి డాక్టరేట్



శేఖర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఇల్లెందురూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకుడు జి.శేఖర్‌కు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందించింది. కేయూ చరిత్ర, టూరిజం మేనేజ్‌మెంట్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ పోలవరపు హైమావతి పర్యవేక్షణలో 'డిప్లమసి ఆఫ్ ది రాయస్ ఆఫ్ ది విజయనగర 1336–1565' అనే పరిశోధన అంశంపై శేఖర్ వైవా పూర్తి చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం చిన్నప్పయ్య మాట్లాడుతూ.. ఈ ఏడాదిలోనే ఐదుగురు అధ్యాపకులు డాక్టరేట్ పొందారని, తద్వారా ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మంది డాక్టరేట్ పట్టా అందుకున్న చరిత్ర ఇల్లెందు కళాశాలకు దక్కిందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు, అధ్యాపకులు శ్రీదేవి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, వెంకటేశ్వరరావు, రాకేష్ శ్రీరాం, రాజు, శేఖర్, ఈశ్వర్, సురేందర్, సరిత, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, లక్ష్మణ్‌రావు, సుజాత, యువకుమార్ పాల్గొన్నారు.

కమనీయంగా రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

పరీక్షా కేంద్రాల్లో అదనపు కలెక్టర్ తనిఖీలు



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

అశ్వారావుపేటరూరల్: పదో తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అశ్వారావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలల కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని వినాయకపురం గ్రామ శివారులో ఉన్న శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పూజలు చేశారు. జాతరకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు 1న ఎంపికలు

భద్రాచలంటౌన్ : పట్టణంలో వచ్చేనెల 1న జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జీవి రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైనవారిని హైదరాబాద్ రామంతపూర్‌లో ఏప్రిల్ 18 19 తేదీల్లో జరిగే క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు, మేలో జరిగే ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డును తీసుకుని రావాలని, ఉచిత భోజన సదుపాయం కల్పిస్తామని వివరించారు.

బేకరీ తినుబండారంలో పురుగు

వినియోగదారుల ఫోరంను ఆశ్రయించిన బాధితుడు!

పాల్వంచ: పట్టణంలోని బీసీఎం రోడ్‌లో ఉన్న ఓ బేకరీ షాపులో తినుబండారం ఆర్డర్ ఇవ్వగా అందులో పెద్ద పురుగు ప్రత్యక్షమైంది. ఇదేమని వినియోగదారుడు ప్రశ్నించగా షాపు నిర్వాహకుడు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వినియోగదారుల ఫోరంలో కేసు వేసినట్లు సమాచారం.

నేడు 'నిధి ఆప్‌కే నికట్'

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఈనెల 27న 'నిధి ఆప్‌కే నికట్' నిర్వహించనున్నట్లు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ బి.నాగుల్ తెలిపారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మం ఎస్‌బీఐటీ కళాశాలలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించి ఇల్లెందు మున్సిపాలిటీలో ఉదయం 9–30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జెడ్పీ సీఈఓ సందర్శన



విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి

దమ్మపేట: మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి బుధవారం సందర్శించారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం జమేదారుబంజర గ్రామంలో పర్యటించి పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పల్లె ప్రకృతి వనం, నర్సరీలను సందర్శించి, పలు సూచనలు చేశారు. ప్రాథమిక పాఠశాలలో తాగునీటి ట్యాంకు, వంట షెడ్డు, మరుగుదొడ్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, వారి పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రా రెడ్డి, ఎంపీఓ రామారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. గణిత పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 12,273 మందికిగాను 12,240 మంది హాజరుకాగా, 33 మంది గైర్హాజరయ్యారు. సప్లిమెంటరీ విద్యార్థులు 360 మందికి గానూ 320 మంది హాజరు కాగా 43 మంది గైర్హాజరయ్యారు. అడిషనల్ కలెక్టర్, ఇద్దరు జిల్లా పరిశీలకులు డీఈఓ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం కలిసి 28 సెంటర్లు తనిఖీ చేశారు. ఈ మేరకు డీఈఓ ఎం.వెంకటేశ్వరచారి వివరాలు వెల్లడించారు. ఎటువంటి మాల్ ప్రాక్టిస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

లక్ష్యం చేరనట్టే..?

- పన్ను వసూళ్లలో మున్సిపాలిటీల వెనుకబాటు
- చివరిలో 90 శాతం వడ్డీ రాయితీ అవకాశం
- ఆర్థిక సంవత్సరంలో మిగిలింది ఐదు రోజులే..



కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీల్లో ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యం నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. ఆర్థిక సంవత్సరం మరో ఐదు రోజుల్లో ముగియనుంది. కానీ పన్ను వసూలు లక్ష్యానికి చాలా దూరంలోనే ఉంది. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు మున్సిపాలిటీల్లో ఇల్లెందు మినహా మిగిలిన మున్సిపాలిటీల్లో ఇంటి పన్నులు వసూలు లక్ష్యంలో సగం వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వార్డుల్లో మున్సిపల్ బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ సిబ్బంది తిరుగుతున్నా పన్ను వసూలు పూర్తి స్థాయిలో కావడం లేదు. ఇంటి పన్ను కట్టని వారి పేర్లను వార్డుల్లో బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శిస్తామని, ఆస్తులను జప్తు చేస్తామని అధికారులు ఇటీవల హెచ్చరికలు జారీ చేసినా పన్ను చెల్లింపులు మెరుగుపడలేదు. ఏటా పురపాలికల్లో లక్ష్యం పూర్తికావడంలేదు. దీంతో బకాయిలు మరుసటి సంవత్సరంలో కలుస్తుండగా లక్ష్యం పెరిగిపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 19.42 కోట్ల పన్ను వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.12.11 కోట్లే వసూలు చేశారు.

90 శాతం వడ్డీ రాయితీ

పేరుకుపోయిన మొండిబకాయిలు వసూలు చేసేందుకు మున్సిపల్‌శాఖ 90 శాతం వడ్డీ రాయితీని బుధవారం నుంచి అమలు చేస్తోంది. ఈ అవకాశం ఈ నెల 31వ తేదీ వరకే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మొండిబకాయిలకు ఇంటి పన్ను ఎంతో ఉంటుందో, వడ్డీ కూడా అంత పెరిగింది. దీంతో ప్రజలకు పన్ను చెల్లింపులు భారంగా మారింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ శాఖ రాయితీ ఇస్తుండటంతో చెల్లింపుదారులకు ఊరట కలుగనుంది. రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పన్ను చెల్లించి మున్సిపాలిటీల అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు. అయితే వడ్డీ రాయితీకి మూడు, నాలుగు రోజులకే పరిమితం చేయకుండా నెల రోజులపాటు అవకాశం ఇస్తే ఎక్కువ మంది వినియోగించుకునే అవకాశం ఉంటుంది. పన్ను చెల్లింపులు కూడా పెరుగుతాయి. కాగా పన్ను బకాయిలు పేరుకుపోతుండగా ఆదాయం తగ్గి వేతనాలు, ఇతర అభివృద్ధి పనులకు మున్సిపల్ జనరల్ ఫండ్‌ను వినియోగించాల్సి వస్తోంది. దీంతో జనరల్ ఫండ్‌తో చేపట్టాల్సిన పనులకు ఆటంకం ఏర్పడుతోంది. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల్లో బిల్ కలెక్టర్లు 56 మంది, వార్డు ఆఫీసర్లు 57 మంది, మొత్తం 113 మంది ఉన్నారు. వీరంతా ఇంటింటికీ తిరిగి పన్ను వసూళ్లు చేస్తే ఆదాయం పెరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

రెండు మున్సిపాలిటీలకు ఒక్కరే కమిషనర్

కొత్తగూడెం, పాల్వంచ రెండు మున్సిపాలిటీలకు ఒక్కరే కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. దీని వల్ల మున్సిపల్ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేయడంలో జాప్యం జరుగుతోంది. కమిషనర్ పూర్తిస్థాయిలో సమయం కేటాయించే అవకాశం లేకపోవడంతో కిందిస్థాయి ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మున్సిపాలిటీ	వార్డులు	లక్ష్యం	వసూలు
		రూ.కోట్లలో	
కొత్తగూడెం	36	7.93	4.84
పాల్వంచ	24	6.36	3.80
ఇల్లెందు	24	2.68	2.09
మణుగూరు	20	2.45	1.38
మొత్తం	104	19.42	12.11

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



మున్సిపాలిటీల్లో నివసించే ప్రజలు 90 శాతం వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెల 31న సెలవు అయినప్పటికీ మున్సిపల్ కార్యాలయం తీసి ఉంటుంది. పన్నులు చెల్లించవచ్చు. పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి.

–సుజాత, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

ఆకాశవాణిలో విద్యార్థుల గళం



కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో పాటలు పాడుతున్న విద్యార్థులు

టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రంలో కదంబ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిభ చాటారు. పాటలు, గేయాలు, సామెతలు, కథలు, ఇంగ్లిష్ రైమ్స్, పొడుపు కథలు, నాటికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో 23 మంది విద్యార్థులు పాల్గొని తమ గళాన్ని ఆకాశవాణి ద్వారా వినిపించారు. హెచ్‌ఎం జ్యోతిరాణి కూడా బాలమేళాపై ఆకాశవాణిలో ప్రసంగం ఇచ్చారు.

ఉపాధ్యాయులు, విద్యార్థులే కూలీలా..?





వంట పాత్రలు మోసుకెళ్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల వంట పాత్రలను వారే మోసుకెళ్లిన వైనం

టేకులపల్లి: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు వంట పాత్రలు మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, గిరిజన పాఠశాలలకు మధ్యాహ్న భోజన వంట పాత్రలను పంపిణీ చేసింది. బుధవారం టేకులపల్లి మండలంలోని 68 పాఠశాలలకు ఎంఈఓ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి జగన్ హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు వంట పాత్రలను అప్పగించారు. వంట పాత్రలు తీసుకెళ్లేందుకు ప్రత్యేక వాహనాలు, సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడంతో ఉపాధ్యాయులే తీసుకెళ్లాల్సి వచ్చింది. కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులను కూడా తీసుకొచ్చి వంట పాత్రలు మోయించారు. కాగా వంట పాత్రలను తరలించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేస్తే బాగుండేదని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాల సమయంలో ఉపాధ్యాయులను పిలిచి వంటపాత్రలు అప్పగించడం సరికాదని యూటీఎఫ్ జిల్లా నాయకుడు కిషోర్ సింగ్ పేర్కొన్నారు.

'పెద్దమ్మతల్లి' పాలకవర్గంలో అవకాశం కల్పించాలి



వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న యువకులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ కమిటీలో కేశవాపురం, జగన్నాథపురం గ్రామస్తులకు అవకాశం కల్పించాలని, అప్పటివరకు పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిలిపివేయాలని కోరుతూ బుధవారం ఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇద్దరు యువకులు ఆలయం ఎదుట ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గంధం నర్సింహారావు, బాదర్ల నాగేశ్వరరావు, గంధం సతీష్, గంధం రామయ్య, కొండం పుల్లయ్య, లింగయ్య, లక్ష్మి, అల్లం స్వరూప, రాములు, భూలక్ష్మి, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎండోమెంట్ కమిషనర్ నుంచి మంగళవారం సర్క్యులర్ రావడంతో బుధవారం నూతన కమిటీ సభ్యులతో మాట్లాడేందుకు సమావేశం ఏర్పాటు చేశామని, ప్రమాణ స్వీకారానికి ఇంకా మూహూర్తం ఖరారు చేయలేదని ఈఓ రజనీకుమారి తెలిపారు.

రామయ్య పెళ్లికి రండి

జిల్లా జడ్జికి ఆలయ ఈఓ ఆహ్వానం



జిల్లా జడ్జికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఈఓ రమాదేవి

కొత్తగూడెంటౌన్: భద్రాచలంలో ఏప్రిల్ 6వ తేదీన నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలకు రావాలని జిల్లా జడ్జి పాటిల్ వసంత్‌ను ఆలయ ఈఓ రమాదేవి కోరారు. ఈ మేరకు జడ్జికి బుధవారం ఆహ్వాన పత్రిక అందజేసి, ఘనంగా సత్కరించారు.

కల్యాణానికి పోచంపల్లి పట్టువస్త్రాలు..

భద్రాచలంటౌన్ : శ్రీరామనవమి, పట్టాభిషేకం వేడుకల వినియోగించే పోచంపల్లి పట్టువస్త్రాల నేత పనులను ఈఓ రమాదేవి బుధవారం ప్రారంభించారు. ముందుగా భక్త రామదాసు మందిరంలో సికింద్రాబాద్ గణపతి దేవాలయం మాజీ చైర్మన్ ఎస్.ఎస్.జయరాజు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మగ్గానికి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కాగా, స్వామివారి వస్త్రాలను ఏప్రిల్ 4న ఆలయ అధికారులకు అందజేస్తారు. కార్యక్రమంలో పద్మశాలీ అన్న సత్రం అధ్యక్షుడు గోషిక యాదగిరి, పోచంపల్లి చేనేత కళాకారులు కడవేరు చంద్రశేఖర్, ఆడెపు ఆంజనేయులు, ఇంజమూరి యాదగిరి, దోర్నాల శ్రీనాథ్, ఎలగందుల కరుణాకర్, రాపోలు గణేష్ పాల్గొన్నారు.

కొలతల ప్రకారమే చెల్లింపులు



మందలపల్లిలో పనులను పరిశీలిస్తున్న డీపీఓ

దమ్మపేట/ములకలపల్లి : ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు కొలతల ప్రకారమే వేతనం చెల్లిస్తామని డీపీఓ చంద్రమౌళి అన్నారు. దమ్మపేట మండలం మందలపల్లి, ములకలపల్లిలోని సుందరయ్య నగర్ శివారులో చేస్తున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఎంత పనిచేస్తే రూ.300 కూలీ వస్తుందనే విషయాన్ని కొలతల ద్వారా వివరించారు. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31 లోగా అన్ని పంచాయతీల్లో ఇంటి పన్ను బకాయిలు పూర్తిగా వసూలు చేయాలని జీపీ కార్యదర్శులను ఆదేశించారు. వసూలైన నగదును వెంటనే ఎస్‌టీఓలో జమ చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ రవీంద్రారెడ్డి, ఎంపీఓ రామారావు, ఇన్‌చార్జ్ ఎంపీఓ వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శులు రవి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లపల్లి ఎస్‌ఐపై విచారణ

గుండాల: ఆళ్లపల్లి ఎస్‌ఐ రతీష్‌పై పోలీస్ అధికారులు విచారణ చేపట్టారు. బాధితుల కథనం ప్రకారం .. టేకులపల్లి మండలం కిష్టారం(రోడ్డు గుంపు) గ్రామానికి చెందిన పాషా కుటుంబ సభ్యులతో గత ఆదివారం ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామంలోని ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. తిరిగివస్తుండగా ఆళ్లపల్లి స్టేషన్ ముందు ఎస్‌ఐ రతీష్ కారు ఆపి దురుసుగా ప్రవర్తించాడని, తన భర్తపై అనవసరంగా చేయి చేసుకున్నాడని పాషా భార్య జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో బుధవారం ఇల్లెందు డీఎస్పీ విచారణ చేపట్టారు. ఈ విషయమై ఇల్లెందు డీఎస్పీ చంద్రభానును వివరణ కోరగా.. వాహన తనిఖీల్లో ఉన్న ఎస్‌ఐకి, పాషా అనే వ్యక్తికి మధ్య వాగ్వాదం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు విచారణ చేపట్టామని పేర్కొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

అశ్వారావుపేటరూరల్: ఓ లారీ అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. భద్రాచలం వైపు నుంచి రాజమండ్రి వెళ్తున్న లారీ అశ్వారావుపేటలోని భద్రాచలం రోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో లారీ ముందు భాగంగా ధ్వంసం కాగా, డివైడర్ దిమ్మె దెబ్బతిన్నది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. కాగా, కొద్ది రోజులుగా డివైడర్ నిర్మిస్తున్నా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తక్షణమే డివైడర్ నిర్మించే చోట ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ద్విచక్రవాహనం చోరీ



బైక్ చోరీ చేస్తున్నట్లు నిక్షిప్తమైన సీసీ ఫుటేజీ

చండ్రుగొండ : చండ్రుగొండలోని ప్రధాన సెంటర్‌లో ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనం మంగళవారం రాత్రి చోరీకి గురైంది. బాధితుడి కథనం ప్రకారం... గ్రామీణ బ్యాంకు ఉద్యోగి యాదగిరి తన ద్విచక్రవాహనాన్ని రోజులాగే రాత్రి ఇంటి ముందు నిలిపాడు. బుధవారం ఉదయం నిద్రలేచేసరికి వాహనం చోరీకి గురైంది. సీసీ ఫుటేజీ పరిశీలించగా తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఇద్దరు దుండగులు వాహనాన్ని చోరీ చేస్తున్నట్లు రికార్డయింది. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ దొంగతనం జరగడం చర్చనీయాంశంగా మారింది.

9 మంది మావోయిస్టులు లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులతో పోలీసులు

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్‌చవాన్ ఎదుట ఆరుగురు మహిళా మావోయిస్టులతో సహా తొమ్మిది మంది మావోయిస్టులు బుధవారం లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపట్టిన గర్ వాపస్ అయే పునరావాస విధానంతో మావోయిస్టులు లొంగుబాటు పడుతున్నారని ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన తొమ్మిది మందిపై రూ.26లక్షల రివార్డు ఉన్నట్టు పేర్కొన్నారు. లొంగిపోయిన వారిలో బండు అలియాస్ బండి మడ్కం, మాసే అలియాస్ వెట్టి కన్ని, పదమ్ సమ్మి, మాద్వి హుంగా, పూనెం మగండి కడ్తి విజ్జే అలియాస్ జయో, మడ్కం శాంతి, ముచాకి మాసే, కడ్తి హిడియా అలియాస్ హితేష్ ఉన్నట్టు వివరించారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణసాయంగా రూ.25 వేలు అందించినట్లు తెలిపారు.

గంగారం డిప్యూటీ వార్డెన్ అరెస్ట్

టేకులపల్లి: మండలంలోని గంగారం ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ వార్డెన్ మాలోత్ ప్రతాప్‌సింగ్‌ను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. బోడు ఎస్‌ఐ పొడిశెట్టి శ్రీకాంత్ కథనం ప్రకారం.. డిప్యూటీ వార్డెన్ ఈ నెల 18న మధ్యాహ్నం మద్యం తాగి పాఠశాలకు హాజరై తొమ్మిదోతరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. 19న తల్లిదండ్రులు, గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ఏటీడీఓ, హెచ్‌ఎంల నివేదికల ఆధారంగా ఐటీడీఏ పీఓ రాహుల్ ఇప్పటికే ప్రతాప్‌సింగ్‌ను సస్పెండ్ చేశారు. స్వగ్రామం ఉసిరికాయలపల్లిలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి ఇల్లెందు కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పశువుల వాహనం స్వాధీనం

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న ఓ వాహనాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై టీ యయాతి రాజు కథనం ప్రకారం.. ఏపీలోని అనకాపల్లి జిల్లా తుని మండలం ఇమిడిపూడిలో జరిగే వారపు సంతలో తొమ్మిది లేగ దూడలను కొనుగోలు చేసి బోలెరో వాహనంలో హైదరాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలోనే స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో వాహన తనిఖీ చేపట్టిన పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. విచారణ నిర్వహించి నిందితులు, తుని మండలం మన్యపుట్ల గ్రామానికి చెందిన తులపర్తి దుర్గాప్రసాద్, నామావరం గ్రామానికి చెందిన గింజల నాగేశ్వరరావులపై కేసు నమోదు చేశారు. లేగ దూడలను పాల్వంచ గోశాలకు తరలించి, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

కారుకు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు



స్వల్పంగా కాలిన కారు

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల కాలనీ గ్రామంలో ఇంటి బయట పార్కింగ్ చేసిన కారుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. గ్రామానికి చెందిన హరీష్ రోజూ లాగే రాత్రి ఇంటి బయట తన కారు పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారుకు నిప్పంటించారు. అర్ధరాత్రి 1.30 గంటలకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు లేచిన యజమాని మంటలు గమనించాడు. చుట్టు పక్కలవారిని నిద్రలేపి మంటలను ఆర్పివేశారు. సీఐ అశోక్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇసుక నిల్వలు సీజ్

బూర్గంపాడు: ఇసుక అక్రమ నిల్వలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. బూర్గంపాడులోని ఓ అట్టల ఫ్యాక్టరీలో అక్రమంగా నిల్వచేసిన 33 ట్రక్కుల ఇసుకను బుధవారం ఆర్ఐ నర్సింహారావు ఆధ్వర్యంలో సీజ్ చేశారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసి నిల్వ చేయడంతో ముగ్గు పోసి సీజ్ చేశామని ఆర్ఐ తెలిపారు. తహసీల్దార్ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పాల్వంచ వాసి హనుమకొండలో ఆత్మహత్య

పాల్వంచరూరల్: డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న యువకుడు ఆత్మహత్య చేసుకోవడంతో సీతానగర్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం బస్వతారాక కాలనీ పంచాయతీ సీతానగర్‌కాలనీకి చెందిన రామకృష్ణ, సక్కు దంపతుల కుమారుడు సాయికుమార్ (27) ఆరు నెలల క్రితం హనుమకొండ వెళ్లి అక్కడే డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల భార్య పుట్టింటికి వెళ్లి రాకపోవడంతో మంగళవారం రాత్రి అద్దెకు ఉంటున్న నివాసంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహన్ని బుధవారం స్వస్థలానికి తీసుకురాగా దహన సంస్కారాలు నిర్వహించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ఖమ్మంరూరల్: అప్పుల బాధ భరించలేక కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఖమ్మంరూరల్ మండలం మంగళగూడెంనకు చెందిన బోనగిరి ఉప్పలయ్య (49) తనకున్న ఎకరంన్నరకు తోడు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాడు. అయితే, చీడపీడలతో ఆశించిన దిగుబడి రాక వచ్చిన కొద్దిపాటి పంటను మంగళవారం ఖమ్మం మార్కెట్‌లో అమ్మాడు. కానీ, వచ్చిన నగదు కౌలు, పెట్టుబడికే సరిపోకపోవడంతో మిగతా అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో చేనులో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులు సమాచారం ఇచ్చారు. ఉప్పలయ్య భార్య ఉపేంద్ర ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

'పాలకుల తీరుతోనే రైతు ఆత్మహత్యలు'

ఖమ్మంమయూరిసెంటర్: పాలకుల విధానాల ఫలితంగానే రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదిరాజు రమేష్ పేర్కొన్నారు. ఖమ్మంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు సరైన సహకారం అందించకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురవుతుందని ఆరోపించారు. ఇకనైనా స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలుచేసి రైతుల ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.